# పొలం బేరం

నలగామరాజు పాలెం దగ్గర వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూములు చౌకగా అమ్మేస్తున్నారని వెంకటేశ్వరరావు చెప్పిన తరువాత నాకు బహు ఆరాటం కలిగింది. ఎట్లాగైనా పది ఎకరాల భూమి సంపాదిద్దామని. ఇన్నాళ్ళు ఉద్యోగం చేసినా ఒక సెంటు భూమి అయినా సంపాదించలేక పోయినాను.

"మీకేమైనా భూవసతి ఉందా?" అని ఎవరైనా అడిగితే ఏమీ లేదని చెప్పటం చాలా సిగ్గుగా ఉంది.

ఆ భూములు ఏమంత సారవంతమైనవి కావనీ, పనికొచ్చే భూములు కావనీ కొంతమంది చెప్పారు. కాని ఏదో రకం పొలం అంటూ ఉంటే అదీ గౌరవమేనని తోచింది. పది ఎకరాల భూస్థితి ఉందని చెప్పుకోవచ్చు! ఏమీ పండకపోతే, ఈ సంవత్సరం పొలాల మీద దమ్మిడి ఆదాయం రాలేదని చెప్పుకొన్నా అదీ ఒక తమాషాగానే ఉంటుంది నిజానికి.

అదీగాక ప్రస్తుతం పండకపోయినా, ఇంకా ముందు పండుతుందేమో ఎవరు చెప్పగలరు? కొని పడేసి ఉంచితే మంచిది. ఇల్లాగ అనేక విధాలుగా ఆలోచించాను.

ఈ సంగతి కృష్ణారావుగారికి కూడా చెప్పాను. ఆయన సలహా అడిగాను. ఆయన తప్పకుండా కొనమని సలహా ఇయ్యటమే కాకుండా తాను కూడా పది ఎకరాలు కొనుక్కుంటానన్నాడు.

అసలు విషయంలో మమ్ములను ప్రోత్సాహపెట్టింది వీరయ్యగారు. ఆయన డబ్బు గలవాడు. పెద్ద ఎత్తులో ఓ యాభై ఎకరాలు ఏక ఖండంగా కొని మామిడి తోట వేయించాలని ప్లానులు వేస్తున్నాడు.

మేము ముగ్గురం కలిసి మాట్లాడుకొన్నాము. మరునాడు బయలుదేరి వెళ్ళి భూములు చూడటానికి నిశ్చయించాము.

కృష్ణారావుగారూ నేనూ కలిసి రహస్యంగా ఒకటి అనుకొన్నాము.

"వీరయ్యగారు యాభై ఎకరాలు కొని అక్కడే బంగళా కట్టించి అందులో ఉండి తోటలు వేయిస్తాడు. మన పొలాల్లో కూడా తోటలు వేయిద్దాం. ఎట్లాగూ ఆయన భూముల మీద ఉంటాడు కాబట్టి మన పని కూడా చూసిపెడతాడు" అన్నాను నేను.

" ఆ మాట మీరు తెలివితక్కువగా ఇప్పుడే అనబోకండి. భూములు కొనటం పూర్తి అయిన తరువాత మెల్లగా పని కూడా ఆయనకే అంటగడదాం" అన్నాడు కృష్ణారావుగారు.

ఆ మాటా నిజమే! మా పనులు కూడా ఆయనే చూడవలసి ఉంటుందని ముందుగా చెపితే ఈ గొడవ అంతా ఎవరు పడతారని ఆయన మొదట్లోనే తప్పుకొంటాడేమో!

కృష్ణారావుగారు తెలివైన సంగతే చెప్పాడనిపించింది! ఇంకో విషయం కూడా ఉన్నది.

కృష్ణారావుగారి దగ్గర గానీ, నా దగ్గర గానీ డబ్బు ఏమీ లేదు. ఈ భూములు కొంటానికి ఎంత లేదన్నా చెరొక వంద కావాలె.

"డబ్బు చేతిలో లేకుండా భూములు బేరం చేయటం ఏమిటి?" అని మేము అనుకోకపోలేదు. అనుకొన్నాము గాని, డబ్బు ఎల్లాగో పుట్టిద్దామనుకొన్నాము.

డబ్బు పుట్టిద్దాము అన్న మాట మాత్రము ఇద్దరమూ కలిసి అనుకొన్నాము. ఎల్లాగు పుట్టించాలెనన్న విషయము మాత్రం ఎవరికి వారే, విడిగా స్వతంత్రంగా ఆలోచించుకొన్నాము. డబ్బు పుట్టించే విషయంలో మాకు ప్రత్యేకమైన నేర్పు ఉంది.

మరునాడు బయలుదేరాము.

"నగచ్ఛత్ బ్రాహ్మణ త్రయం" అన్నారు కాబట్టి ముందు వీరయ్యగారూ నేనూ స్టేషనుకు వెళ్ళాము. కృష్ణారావుగారు వెనుక నుంచి వచ్చి కలుసుకొన్నారు.

ముగ్గురం నలగామరాజుపాలెం వెళ్ళి వెంకటేశ్వర రావును కలుసుకొని పొలాలు చూడటానికి వెళ్ళాము. మాతో అప్పలాచారి, బాపనయ్యగారూ కూడా వచ్చారు.

వారిద్దరూ దేవాలయానికి సంబంధించిన ఉద్యోగస్తులు.

బాపనయ్య పొట్టిగా ఎఱ్ఱగా ఉంటాడు. చదువుకొన్న వాడు కాదు. ఏదో కొద్ది చదువు చదివాడు. విద్యావంతులను చూస్తే అతనికి ఎంతో గౌరవము. వినయవిధేయతతో మాట్లాడుతాడు.

అప్పలాచారి పొడుగ్గా, నల్లగా ఉంటాడు. లోతుకు పోయిన కళ్ళు. అతనూ అట్టే చదువుకొన్న వాడు కాదు. కాని వ్యవహారాలూ, రాజకీయాలూ బాగా తెలిసిన మనిషి.

అతడు పదిహేను రూపాయల జీతం మీద చాలా గొప్పగా బతుకుతున్నాడు. డబ్బు గల వాళ్ళు అంటే అతనికి గౌరవం. తాను బీదవాడైనా బీదవాళ్ళను చూస్తే అతనికి అసహ్యం.

మేము కొనదల్చుకొన్న పొలాలు ఊరికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్నవి. నడిచే వెళ్ళాము. అంతా అడవి. అక్కడక్కడ కొన్ని పొలాలలో వేరుసెనగ వేశారు.

రెండు గంటలు నడిచిన తరవాత మేము చేరవలసిన ప్రదేశం చేరాము. అంతా చిట్టడవి!

చాలా దూరం నడిచిన తరువాత బాపనయ్య గారు నిలబడి, “ఇవేనండి భూములు!” అన్నారు.

మేమంతా ఆగి చుట్టూ చూశాము. ఎక్కడా నరసంచారం లేదు. ఏవో విచిత్రమైన పక్షి కూతలు వినిపించినవి.

దగ్గరలోనే ఒక చిన్న కొండ ఉన్నది. దాని చుట్టూ భూమి కాస్త పల్లంగా ఉంది. అక్కడో చెరువు కూడా ఉన్నది.

అప్పుడు నేను అనుకొన్నాను, “ ఆ చెరువు చుట్టూ ఉన్న పల్లపు భూమి కొంటే బాగుండును” అని! ఎందుకంటే నేను వేరే బావి తవ్వించవలసిన అగత్యం ఉండదు. చెరువు కాస్త బాగు చేయిస్తే, నీళ్ళు బాగా నిలుస్తవి. నీళ్ళతో ఒక మంచి మామిడితోట వేయించవచ్చు.

ఈ ఆలోచన మనస్సుకు తోచటంతోనే నా రక్తం పొంగింది. ఒళ్ళు ఝల్లుమంది. చక్కిలిగింత పెట్టినట్లు అయింది. ఆ జలాశయానికి చుట్టూ ఉన్న భూమిలో పది

ఎకరాల చుట్టూ గిరి గీయించి అది నేను తీసుకుందామని అనుకొన్నాను.

అయితే వీరయ్యగారు ఆ ఖండం ఖండం వంద ఎకరాలు తీసుకొంటా నంటే ఎట్లా! ఎందుకు అనడూ? అని తీరుతాడు. కాస్త కష్టం వేసింది, అట్లా అంటాడు. అనుకొనేసరికి ఇంతలోనే వీరయ్యగారు అడగనే అడిగాడు, "ఆ భూములు అమ్ముతారా?" అని అటు చూపిస్తూ!

బాపనయ్య గారు అన్నారు, "ఆ భూములు అన్నీ కూడా రెండు వందల యాభై ఎకరాలు. నాగపోతరావుగారు కొని వేశారు." అని.

అయిపోయింది. ఆ ఆశ కూడా పోయింది. నాగపోతరావుగారి మీద భలే కోపం వచ్చింది. మాకు లేకుండా పోవాలనే ఆయన కొన్నాడనిపించింది. లేకపోతే ఎందుకూ ఆయనగారికి ఆ పొలాలన్నీ? సరే ఏం జేస్తాము. ఆయన భాగ్యవంతుడు. ఏషియా మేరనంతాకొన్నా ఊరుకోవాలిసిందే!

"అయితే ఇప్పుడు అమ్మకానికున్న భూములేవి?" అని వీరయ్యగారు అడిగారు.

"గుట్టకు పడమట గానూ ఉత్తరంగానూ ఉన్న అడవి అంతా అమ్మకానికే " అన్నారు బాపనయ్యగారు.

వెంకటేశ్వరరావు ఒక ప్లాను తీసి కాయితం మీద చూపాడు. ఆ భూముల వివరం. వీరయ్యగారు ఆ ప్లాను చూస్తున్నారు.

కళ్ళతో చూడవలసిందే గాని కాయితం మీద చూచి నేను అర్థం చేసుకోలేను. నేను తెల్లపోయి ఉండటం చూచి బాపనయ్య గారు నా స్థితి గ్రహించి "మీకు అట్లా చూస్తే అర్థం గాదు. ఇల్లారండి. భూమితొక్కి నేను చూపిస్తాను" అని నన్ను పిలిచారు.

నేనూ కృష్ణారావుగారూ కలిసి వెళ్ళాము ఆయనతో.

ఒక ఫర్లాంగుదూరం తీసికెళ్ళి అక్కడ నుంచోబెట్టి, ఉత్తరం దిక్కును చూపిస్తూ "చూడండి, అక్కడ నుంచి ఇదంతా ఇరవై ఎకరాల భూమి, " అంటూ గాలిలో చెయ్యి తిప్పాడు. "దీనికి పడమటగా ఇటువైపు ఒక యాభై ఎకరాలు ఉంది. ఈ ఇరవై ఎకరాలూ మీరు ఇద్దరూ చెరి పదీ తీసుకొండి. ఆ యాభై ఎకరాల ఖండం వీరయ్యగారు తీసుకొంటారు" అని సలహా చెప్పాడు.

నేనొక సంగతి అడిగాను. "అయితే చూడండి, ఆ కనపడే తాటి చెట్లు అన్నీ ఇటు మాకు వస్తయ్యా, అటు ఆయనకు పోతయ్యా?"

బాపనయ్య కాస్త ఆలోచించి "అన్నీ మీకు రావు. సగం మీకు వస్తయి. సగం ఆయనకు పోతయ్యి" అన్నాడు.

ఆ తాటి చెట్లలో సగానికి సగం ఆయనకు పోతవి అంటే నాకు ఎంతో కష్టం వేసింది. అవన్నీ నాకే వస్తే బాగుండు ననుకొన్నాను. అందుకని "చూడండి బాపనయ్యగారూ" ఆ చెట్లు అన్నీ మనకు వచ్చే పద్ధతిలో మనం గీటు గీసుకోకూడదూ?" అన్నాను.

బాపనయ్య గారు నవ్వి "అల్లాగ వీలుపడదండి. దానికి ప్లానులున్నయి" అన్నాడు.

నేను ఏమీ అనలేదు కాని "ఆ తాళ్ళు అన్నీ లేకపోతే ఆ పొలం నాకు ఎందుకూ" అని మనస్సులో అనుకొన్నాను.

అదేదో అన్యాయం అనిపించింది నాకు. ఎట్లాగు అంటే నేను చెప్పలేను గాని అసలు ఆ తాళ్లు అన్నీ నాకే రావాలిసినవి అని మాత్రం మనస్సుకు తెలిసింది.

"సగం తాళ్లూ ఆయనకు పోవలసిందేనా?" అని మళ్ళీ అడిగాను.

బాపనయ్యగారు అంతేనన్నారు. ఏం జేస్తాను? పెద్ద మనుష్యులు అల్లాగే చెబుతూనే ఉన్నారు. "సరే వీరయ్యగారినే కాజేయనియ్యి ఆ తాళ్ళన్నీ!" అని అనుకొని ఊరుకొన్నాను.

కృష్ణారావుగారు ఇంకొక సంగతి ఆలోచిస్తున్నారు.

ఈ ఇరవై ఎకరాలూ మేము ఇద్దరం పంచుకొన్నప్పుడు, ఈ ఉన్న యాభై తాళ్ళూ తన భాగంలోకి వస్తయ్యా నా భాగంలోకి వస్తయ్యా అని!

అవి అన్నీ ఒక దగ్గరే ఉండటం మూలాన ఎవరికో ఒక్కరికే వస్తవి.

వ్యవహారం అంతా నేను నడుపుతున్నాను. సహజంగా నేను ఆ భాగం తీసుకొంటాను. అప్పుడు అతనికి అన్యాయం జరిగినట్లేగా! ఇవి అతని ఆలోచనలు,

బైటకి మాత్రం ఏమీ అనలేదు.

మేము ఇద్దరం కూడా ఏమీ మాట్లాడక ఊరుకోటం జూచి బాపనయ్య గారు మేము కొనటానికి సందేహిస్తున్నామనుకొని "ఆలోచిస్తే ఏమీ లాభం లేదు. నిక్షేపం లాంటి భూమి. మీరు ఇదే తీసుకోండి" అని బలవంతపెట్టాడు.

కృష్ణారావుగారూ నేనూ కలిసి మాట్లాడుకొన్నాము.

స్వామి వారి పొలాలు ఇవి. ఎకరానికి పది రూపాయలు నజరానాకడితే " ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారు మన పేర పట్టా ఇస్తారు. చెరి వంద రూపాయలు కట్టాలె. ఎల్లాగో తెచ్చి కడదామండీ" అన్నాను నేను.

బాపనయ్య గారు ఇంకో విషయం కూడా చెప్పారు. ఆ తాటిచెట్లు అమ్మి వేయవచ్చుననీ, చెట్టుకు రూపాయి యిచ్చి కొట్టుకొని వెడతారని!

కృష్ణారావుగారు తెలివిగా ఒక మాట అన్నారు "ఐతే ఇరవై ఎకరాలూ మనకు నూటయాభైకే వచ్చినట్లు అవుతుందీ" అని.

నిజానికి ఆ యాభై చెట్లు నా భాగంలోనివి కాబట్టి అవి అమ్మగా వచ్చిన డబ్బు నా ఒక్కడికే రావాలిగద!

కృష్ణారావు అందులో సగం భాగం కొట్టేయాలని చూస్తున్నాడు!

పొలం అని పేరే గాని అంతా అడవిగా ఉంది.

'ఇది దున్నటం ఎట్లాగు? ఇందులో ఏమి పండుతుంది?" అని అడిగాను.

"ఈ మొక్కా మొడుసూ అంతా కొట్టించాలె" అన్నారు బాపనయ్యగారు.

"అదో ఖర్చు గాదూ? దానికెంత అవుతుంది?" అని అడిగారు కృష్ణారావుగారు.

"మొక్కా మొడుసూ కొట్టి సాఫీ చెయ్యాటానికి ఎకరానికి ముప్పయి రూపాయలు అవుతుంది" అని బాపనయ్య గారు చెప్పాడు.

ఈ మాటలు వినేసరికి మా యిద్దరికీ ఉత్సాహం చచ్చి ఊరుకొంది. ఒకరి మొగాలు ఒకరు చూచుకొన్నాము. మూడు వందలు ఖర్చు పెట్టడానికి మా దగ్గర డబ్బు ఎక్కడిది!

అంతటితో మేము చల్లబడి ఇంటికి రావలసిందే కాని ఆయన ఓ మాట అన్నారు. ఏమిటంటే "ఆ మొక్కా మొదుసూ అమ్మేస్తే మళ్ళీ ముప్పయ్ మనకు వస్తయ్యి" అని!

"ఎవరు కొంటారు?"

"బోలెడు మంది. అదంతా కాల్చి బొగ్గు చేసి అమ్ముకొనే వాళ్ళు కొనుక్కుని వెడతారు" అని ఆయన నమ్మకంగా చెప్పారు.

ఇంకో మాటకూడా అన్నారు . "మీరు ముందు ఖర్చు చెయ్యాలిసిందల్లా ఒక ఎకరంలో కొట్టించిన మొక్కా మొదుసూ అమ్మి రెండో ఎకరం బాగు చేయించండి. అది అమ్మి మళ్ళీ ఇంకో ఎకరం! అట్లాగు! అని చెప్పాడు ఆయన.

మళ్ళీ కాస్త ధైర్యం వచ్చింది.

ఇంకో లాభం కూడా చూపించారు ఆయన. ఎకరం బాగు చేయించటంతోనే అందులో పైరు వేయవచ్చునట!

ఇంకా మాకు ఏదో భయంగా ఉండి ఆలోచిస్తూ నుంచుంటె, బాపనయ్యగారు నా భుజం మీద చెయ్యి వేసి అవతలకు తీసికెళ్ళి రహస్యంగా ఇట్లా అన్నారు.

ఈ పొలం చూశారూ! ఇది బంగారమే అనుకోండి. ఇక్కడ ఒకటో రకం మామిడి తోట అవుతుంది. ఒక్క బావి తవ్వించుకోవాలె, అంతే! నీళ్ళు పైనే పడతవి. వీరయ్య గారి పొలానికి ఈ సౌకర్యం లేదు. మీరు అట్టే ఆలోచించక నజరానా కట్టి వెళ్ళండి."

బావి తవ్విస్తే ఎంత అవుతుందని అడిగితే ఆరు వందలు కర్చు పెట్టాలన్నాడు.

అంత కర్చు పెట్టలేమని కృష్ణారావుగారూ నేనూ స్పష్టంగా చెప్పేశాము.

"అయితే మీరు మామిడితోట వేసే ప్రయత్నం మానుకోవలసిందే" అన్నాడాయన నిష్కర్షగా.

మనస్సు చివుక్కుమన్నది, మామిడితోట వేసే ప్రయత్నం మానుకోవలసి వచ్చిందేనని! అప్పుడు చటుక్కున ఒక ఉపాయం తోచింది.

"వీరయ్య గారు ఎట్లాగో బావి తవ్వించి తోట వేస్తాడు. ఆ బావిలో నీళ్ళే మన మొక్కలకు కూడా వాడుకొంటే?" అన్నాను నేను.

"ఎట్లా?" అన్నాడు కృష్ణారావుగారు.

"ఎట్లా ఏముందండీ. ఆయన మోటకడతాడా? కాలవలు తవ్వుతాడా? అందులో ఒక కాలవ మన పొలంలోకి తీస్తే సరిపోదుటండీ?" అన్నాను నేను.

"నిజమే ఆ మాట – కాని వాళ్ళు మోట కట్టి కష్టపడి తోడిన నీళ్ళు నిన్ను వాడుకోనిస్తాడా?" అన్నాడు కృష్ణారావుగారు.

"ఐతే ఎట్లాగూ?" అని ప్రశ్న వచ్చింది.

"మీరు కూడా ఒక మనిషిని పెట్టి వాడి చేత తోడించి మీ చెట్లకు పోయించుకోండి" అని సలహా చెప్పారు బాపనయ్యగారు.

కృష్ణారావుగారూ నేనూ కూడా చాలా సంతోషించాము ఆయన ఉపాయం చెప్పినందుకు. వీరయ్యగారు తన బావిలోనుంచి మేము నీళ్ళు తోడుకుంటానికి ఒప్పుకొంటే ఇక మామిడితోట వేయటానికి ఆ ఆటంకమూ ఉండదు.

"కృష్ణారావుగారూ నేనూ కూడా తోట వేయించే పక్షంలో, మా యిద్దరి తోటలకు వీరయ్యగారు నీరు ఇస్తాడా? అల్లా ఇయ్యమని అడగటం బాగుంటుందా?" అని ప్రశ్న వచ్చింది. చాలాసేపు వాద ప్రతివాదనలు జరిగినవి. చివరకు కృష్ణారావుగారు తోట వేసే ప్రయత్నం వదులుకొనేటట్టు, నేను ఒకణ్ణే ఒక ఎకరం భూమిలో తోట వేసుకొనేటట్లు నిశ్చయించాము. కృష్ణారావుగారు ఈ విషయంలో కాస్త త్యాగం చూపెట్టారు. మా యిద్దరి మధ్య పొట్లాటలు లేకుండా వ్యవహారం పరిష్కారం అయిపోయింది.

"ఇంతకూ వీరయ్యగారు నా ఎకరం తోటకైనా నీళ్ళు యియ్యటానికి ఒప్పుకొంటాడో ఒప్పుకోడో?"

"ఆ విషయం కూడా ఇప్పుడే తేల్చుకొందాము రండి" అన్నాడు కృష్ణారావుగారు.

అప్పటికి వీరయ్యగారు, అప్పలాచారి ప్లానులు చేత్తో పట్టుకొని మేమున్న చోటుకు రెండు ఫర్లాంగుల దూరంలో నుంచుని మాట్లాడుతున్నారు.

బాపనయ్యగారిని, వదిలేసి మేము ఇద్దరం వెళ్ళాము అక్కడికి. అప్పలాచారి, వీరయ్యగారు ఏదో గుసగసలాడుతున్నారు. మేము రావటంతోనే వాళ్ళు మాటలు ఆపేశారు.

నేను వీరయ్యగారిని అడిగాను, ఆయన తవ్వించుకొనే బావిలో నుంచి నాకు నీళ్ళు ఇయ్యమని. నా కోరిక న్యాయమైనదేననీ, స్నేహితులము కాబట్టి ఒకరికొకరం ఈ మాత్రం సాహాయ్యం చేసుకొనటం ధర్మమేననీ కృష్ణారావు గారు నన్ను సమర్థించారు.

కాని వీరయ్య ఏం మనిషో నాకు అర్థం కాలేదు. తన బావిలో నుంచి నీళ్ళు పెట్టుకొంటానికి వీలులేదని అన్నాడు.

"ఒకసారి రెండుసార్లు అయితే పోనీలే అని అనుకోవచ్చుగాని అప్పనంగా ఎల్లకాలం పెట్టుకోనిస్తారటయ్యా ఎవరన్నారు? వెయ్యి రూపాయలు పెట్టి నేను బావి తవ్వించటం ఏమిటి, దమ్మిడీ ఖర్చు లేకుండా నీవు నీళ్ళు తోడుకెళ్ళటం ఏమిటి? నేను ఒప్పుకోను."

"నీ బావిలో నీళ్ళు అయిపోతయ్యా?"

"అయిపోయినా పోకపోయినా అల్లాంటి వ్యవహారం పద్ధతి కాదు" అన్నాడు వీరయ్య.

నాకు కష్టం వేసింది. మోసము తలపెట్టాడు వీరయ్యగారు అనిపించింది. నేను తోట వేసే ప్లాను నేల కూలిపోయినందుకు కళ్ళ నీళ్ళ పర్యంతరం అయింది. స్నేహితులు గదా ఈ మాత్రం సాహాయ్యానికి ఒప్పుకోకూడదా అని ఆయన మీద కోపం వచ్చింది. "అయితే నా అంటుమామిడి మొక్కలు నీళ్ళు లేక చచ్చిపోవలసిందనేనా మీ అభిప్రాయం?" అని గట్టిగా అడిగాను. ఈ ప్రశ్నకు ఏం జవాబు చెపుతాడో చెప్పనీ. క్రూరంగా "నీ మొక్కలు చస్తే నాకేం?" అంటాడేమో అని, ఆయన ముఖంలోకి తీక్షణంగా చూశాను.

వీరయ్యగారు కాస్త ఆలోచించి ..నీవు కూడా బావి తవ్వించుకో" అన్నాడు.

"నేను తవ్వించుకో గలిగితే, మిమ్ములను అడగటం ఎందుకూ?" అన్నాను గునుపుగా.

"అల్లా అయితే ఊరుకో" అన్నాడు ఆయన నిర్మొగమాటంగా.

నిజానికి ఆయన బావిలో నీళ్ళు తోడుకొంటే ఆయనకు కలుగబోయే పెద్ద నష్టం ఏమీ లేదు. అయినా ఆయన అంత నిర్దయగా మాట్లాడాడు. అందుకని చాలా కోపం వచ్చింది.

అప్పుడు నాకు ఒక విషయం జ్ఞాపకం వచ్చింది బాపనయ్యగారు చెప్పింది.

అదేమిటి అంటే, రామపాదసాగరం ప్రాజెక్టు వస్తే ఈ భూములన్నీ మాగాణిభూములవుతయ్యనీ. పంటకాలువ నా పొలం పక్కగా పోతుందనీ ఆయన చెప్పాడు.

ఆ మాట జ్ఞాపకం వచ్చి "పోదూ, ఈయనగారు సాహాయ్యం చేస్తే ఎంత! చెయ్యకపోతే ఎంత!" అని మనస్సులో అనుకొని తృప్తి పడి ఊరుకొన్నాను.

బాపనయ్యగారు ఆ మాటే అన్నారు.

వీరయ్యగారు అల్లాగ అన్నారే అని నేను చిన్నబుచ్చుకొని నుంచుని ఉంటే పాపం ఆయన నన్ను కాస్త అవతలకు తీసికెళ్ళి చెప్పారు. "మీరు ఎందుకండి అంత ఇది అవుతారు? మామిడితోట వేయకపోతే నేమండి. ఎట్లాగో పదేళ్ళల్లో రామపాదసాగరం కాలువలు రానే వస్తయి. అప్పుడు ఇది మాగాణే అవుతుంది కదా! ఇక ఈ పదేళ్ళు మెట్టపంట, నిక్షేపంలాగ పండుతుంది ఈ ఖండికలో" అన్నాడు.

దాని మీద నాకు కాస్త ధైర్యం వచ్చి "అయితే ఈ భూములలో ఏమి పండుతయ్యి అండీ?" అని అడిగాను.

కృష్ణారావు గారు ఈ విషయంలో కాస్త తెలిసిన మనిషి. ఆయన "ఈ పొలాలలో జొన్న సమృద్ధిగా అవుతుంది" అన్నాడు.

"జొన్న వేసుకొంటే ఏం లాభం అండీ? వేరుసెనగ వేసుకోండి" అన్నాడు బాపనయ్యగారు.

కృష్ణారావుగారు, "నిజమే ఆ మాట. పండేటట్లు అయితే వేరుసెనగ వేస్తేనే లాభం" అన్నాడు.

ఆహార ధాన్యాలకు కరవుగా ఉన్న ఈ రోజులలో ఏదో కాస్త లాభం వస్తుంది గదా అని వ్యాపారానికి పనికి వచ్చే పంటలు పండించకూడదని నేను అన్నాను.

కృష్ణారావుగారు నవ్వి, "ఇవన్నీ పెట్టుక్కూర్చుంటే ఇక బాగుపడ్డట్లే. మనకు లాభించే వ్యవహారం చూచుకోవాలె" అని గట్టిగా వాదించాడు.

చాలాసేపు వాదించుకొన్నాము.

నేను ఎంతసేపటికి దారికి రాకపొయ్యేసరికి ఆయనకోపం వచ్చి చివరకు ఏమన్నాడంటే – "మీరు లక్ష చెప్పండి నేను మటుకు జొన్న వెయ్యను. వేరుసెనగ వేస్తాను. కావాలంటే మీరు జొన్న వేసుకోండి మీ పొలంలో" అని నిష్కర్షగా చెప్పాడు.

మంచి గాని చెడ్డ గాని ఇద్దరం ఒక దారిని నడవాలె గాని చెరో దారి కావటం నాకు యిష్టం లేదు. అదీకాక ఆయన వేరుసెనగ వేసుకొని లాభం పొందుతూ ఉంటే నేను ఒక్కణ్ణి వ్రతం పట్టి జొన్న వేస్తే మటుకు ఏం లాభం దేశానికి! అట్లా చేయటానికి మనస్సు ఒప్పింది కాదు.

చివరకు ఒక విధంగా రాజీ పడ్డాము.

ఇద్దరం కూడా అయిదు ఎకరాలలో జొన్న, అయిదు ఎకరాలలో వేరుసెనగ వేసుకొనేటట్లు ఏర్పాట్లు జరిగినవి. ఇంతకూ ఈ భూములలో వేరుసెనగ పండుతుందా? ఆ సంగతి బాపనయ్యగారిని అడిగాము.

ఆయన "పండకేం? బంగారంలాగ పండుతుంది!" అన్నాడు.

"ఎకరానికి ఎంత పడుతుంది?" అని అడిగాము.

"ఎకరానికి పుట్టే గదండీ!" అన్నాడు ఆయన నవ్వుతూ.

ఆ నవ్వులో చాలా అర్థం ఉంది. ఎకరానికి పుట్టి అన్న విషయంలో చాలా స్వల్పవిషయమైనట్టూ, అది మాకు తెలియకపోవటం మా తెలివితక్కువతనాన్ని వ్యక్తపరుస్తున్నట్లూ ఆ నవ్వులో దాగి ఉన్న అర్థం.

రెండూ రెండూ నాలుగు, అన్న విషయం అందరికీ తెలిసినట్లే ఎకరానికి పుట్టి అన్న లెక్క అందరూ ఎఱిగి ఉన్న విషయమేనన్నమాట!

మాకు కాస్త చిన్నతనం అయింది. అందుకనే కృష్ణారావుగారు అన్నారు. "అది సరేలెండి. ఎకరానికి పుట్టి అని మీరు చెప్పేదేమిటి? అందరికీ తెలుసు! ఈ పొలం అంత పండుతుందా?"

ఆ ఆసామి పొలంలోకి వెళ్ళి కాస్త మన్ను తెచ్చి అరచేతిలో పోసుకొని మాకు చూపాడు.

చూపి, "చూడండి దీనికేం? ఇందులో ఏమివేస్తే పండదు?" అన్నాడు.

ఆ మట్టిలో ఉండే విశేషము ఏమిటో మాకు బోధపడలేదు.

ఎఱ్ఱమట్టీ, ఇసుకా సమపాళ్ళుగా కలిసిన దాంట్లో గుచ్చెత్తిపోసినట్టు గులకరాళ్ళూ ఉన్నవి.

రేగటి మట్టి మంచిదని మాకు తెలిసిన విషయం. వేరుసెనగకు ఇల్లాంటిదే కావాలేమో మాకు తెలియదు. పొలంలో పుట్టి పొలంలో పెరిగిన రైతుబిడ్డ చెపుతూ ఉంటే ఎట్లా కాదనగలము?

అయినా కృష్ణారావు గారు అన్నారు, "అయితే రాళ్ళూ ఇసుకా ఉన్న ఈ మట్టే మంచిది అంటారా?"

"మంచిదేనా అని ఇంకా అడుగుతున్నారా? బంగారం కాదండీ! ఇది బంగారం లాంటి భూమి" అని అన్నాడు బాపనయ్యగారు.

"ఈ రాళ్ళూ?" అన్నాము మేము. సందేహం తీరక.

రాళ్ళు ఉంటే ఏమండీ, రాళ్ళు భూమికి బలం కాదండీ!" అన్నాడు ఆయన మా అజ్ఞానాన్ని చూచి నవ్వుతూ.

రాయి కూడా, ఎరువులాగ భూమికి బలాన్ని ఇస్తుందన్న విషయం, మేము ఇంతకుముందు ఎప్పుడూ వినలేదు. కాని ఏమో, ఆ విషయం మనకు గట్టిగా తెలియనప్పుడు, మాట్లాడటం ఎందుకని ఊరుకొన్నాము.

మేము ఇక్కడ మాట్లాడుతూ ఉన్నంతసేపూ, వీరయ్య గారూ అప్పలాచారి ఆ కొసన నుంచుని మాట్లాడుతున్నారు.

అప్పలాచారి ఏదో చెయ్యి త్రిప్పి చూపిస్తున్నాడు. ఆ త్రిప్పటం మా ఇరవై ఎకరాల వైపు కూడా త్రిప్పుతున్నాడు.

ఏమిటో యీ సంగతి విందామని కృష్ణారావుగారూ నేనూ కూడా అక్కడికి వెళ్ళాము.

మేము వాళ్ళ దగ్గరకు వెళ్ళటంతోనే అప్పలాచారి మాట్లాడటం మాని, మా రాకను నిరసిస్తున్నట్లు చూశాడు.

ఏదో రహస్యాలు చెప్పుకొంటున్నారు, "ఏమండీ మేము ఈ ఇరవై ఎకరాలూ తీసుకొంటాము. మీరు ఆ యాభై తీసుకోవటం నిశ్చయమైందా?" అన్నాను.

వీరయ్యగారు, "తీసుకొందువుగానిలే! వస్తాను. నడుస్తూ ఉండండి మీరు" అని, అప్పలాచారితో మాకు కొంచెం దూరంగా వెళ్లాడు. మేము వినకూడని రహస్యాలు ఏమున్నయో వీళ్ళకు? అప్పలాచారిని మేము మొదటి నుంచీ అనుమానిస్తూనే ఉన్నాము. ఆయన మమ్ములను ఇద్దరినీ కూడా తెలివితక్కువవాళ్ళ క్రింద జమ కట్టి మాట్లాడుతూ వచ్చాడు.

ఆయన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారి దగ్గర గుమాస్తా. ఈ భూముల విషయం కాస్త తెలిసిన వాడే. అయితేమటుకు అల్లాగ మాట్లాడటం మాకు కష్టం వేసింది.

ఈ గుసగుసలు చూస్తే, అప్పలాచారి ఏదో కుంభకోణం చేసేలాగున్నాడు అనిపించింది.

ఏం జేయగలడు?

ఒకలాగ తోచింది. ఈ డెభ్భై ఎకరాలు వీరయ్యగారిని తీసుకోమని ప్రోత్సహించి మాకు ఏమీ లేకుండా చెయ్యాలన్న సంకల్పం అతనికి ఉన్నట్లు మాకు తోచింది. ఎందుకంటే, మేము వస్తూ ఉన్నప్పుడు అనేకసార్లు అన్నాడు, "మీకెందుకండీ, ఈ వెధవ పొలాలు" అనీ. "ఇక్కడ ఉండి స్వంతంగా చేసుకొనే వాడికి వీటి వల్ల ఏమైనా లాభం ఉంటుంది కాని, మీరు ఎక్కడో బస్తీలో ఉద్యోగంలో ఉండి, పొలాలు కౌలుకు ఇస్తే, చారెడు గింజలు మీకు దక్కవనీ" ఇల్లాగ అనేకరకాలుగా నిరుత్సాహపరిచాడు.

మాతో ఇలాగ అన్న వాడు వీరయ్య గారితో పెద్ద కబుర్లు చెప్పటం సాగించాడు.

అక్కడే ఒక బంగాళా కట్టించి ఆ భూములన్నీ మరనాగలితో దున్నవచ్చుననీ, అంటుమామిడి తోటలు వేయించి, సంవత్సరానికి రెండు వేలు పెట్టుబడి పెడితే, ఎనిమిదో ఏట పెట్టిన డబ్బంతా గిరుక్కున తిరిగి వస్తుందనీ ఇల్లాగ మాట్లాడాడు.

వీరయ్యగారి చేత పెద్ద వ్యవసాయపు కామాటం పెట్టించి తాను మేనేజరుగ కావాలని ఆయన ఎత్తు. దానికే పాచికలు వేస్తున్నాడు.

అప్పలాచారి మాకు ఇంత అపకారం తల పెట్టాడా? మా పొలాలు మాకు దక్కకుండా చేయాలని చూస్తున్నాడే అని ఇద్దరం అనుకొన్నాము.

ఇంతలో వీరయ్యగారూ అప్పలాచారీ రహస్యాలు మాట్లాడుకొని తిరిగివచ్చారు. అప్పటికి సాయింత్రం మూడు అయింది.

రోడ్డు మీదికి వచ్చిన తరువాత వీరయ్యగారు మమ్మలను ..."కారెక్కి ఇంటికి పొండి" అన్నారు.

"మరి నజరానా కట్టడమూ అదీ ఎప్పుడు?" అని అడిగాను నేను.

"ఏమి తొందర వచ్చిందయ్యా? ఇది వ్యవహారం! తొందరపడకూడదు. మీరు ఇద్దరూ వెళ్ళండి. నేను అన్ని విషయాలు తెలుసుకొని రెండు రోజులలో వస్తాను. ఈ లోపున సొమ్ము జాగ్రత్త చేసి ఉంచండి" అన్నాడు.

"పాపం వీరయ్యగారు మా ఎడల మోసం ఏమీ తలపెట్టలేదు. ఆ అప్పలాచారి ఏదైనా చెప్పినా వినే మనిషి కాదు" అనుకొని సంతోషించి, ఆ రోజు రాత్రి తొమ్మిది గంటలకల్లా ఇళ్ళకు చేరాము.

అంతవరకూ మా ఆవిడతో ఈ విషయం ఏమీ చెప్పలేదు. ఇప్పుడు చెప్పాను. పది ఎకరాలు కొంటున్నానని. ఆవిడ చాలా సంతోషించింది. "మెట్ట పొలాలు అయితే మటుకేం, మంచి భూములు అయితే వాటి వల్ల కూడా చాలా లాభం ఉంది" అన్నది.

"ఈ పది ఎకరాలలో అయిదు ఎకరాలు నీ పేర కొంటాను. ఆ అయిదు ఎకరాలలో ముందు ముందు వచ్చే ఆదాయం అంతా నీ ఇష్ట ప్రకారం వాడుకోవచ్చు" అన్నాను. సంతోషించింది.

ఆ పొలాలలో వేరుసెనగ పండుతుందనీ ఎంత లేదన్నా ఎకరానికి ఖర్చులు

సంగతి ఎత్తి, “మరి భూములు కొనే విషయం ఎల్లాగ నిశ్చయించారు?” అని అడిగాను.

ఆయన ఒక గొడవ చెప్పాడు. ఆ భూములన్నీ దేముడివి. ఈ బోర్డు వారి కిందికి రాకముందు, ఆ దేవాలయానికి ఒక జమీందారుగారు ధర్మకర్తగా ఉంటూ ఉండే వారు.

ఆయన ఈ అడవి అంతా కూడా పెద్ద పెద్ద ఖండాల క్రింద విభజించి అమ్మేశాడు. ఎవరో జమీందార్లు, సాహుకార్లు అవి కొన్నారు. వాళ్ళ పేరున పట్టాలు పుట్టించి ఇచ్చాడు ఆ జమీందారుగారే.

ఈ సాహుకార్లూ వాళ్ళూ ఆ భూములు కొన్నారన్న మాటే గాని అవి ఎక్కడున్నయ్యో వాళ్ళకు తెలియదు. కొని పారేసి వాటి విషయమై పట్టించుకోలేదు.

ఈ లోపున గ్రామంలోని రైతులు ఆ భూములలో తమ పశువులను మేపుకొంటూ, పుల్లాపుడ్రా కొట్టుకొని వెడుతూ వానిని భుక్తపరుచుకొన్నారు. ఆ రైతులకు సాహుకార్లకు తగాదాలుగా ఉండి, రైతులు భూములు మావేనని అంటున్నారు.

దేవాలయం బోర్డువారి అధీనంలోకి వచ్చిన తరువాత వారు ఈ విషయం అంతా విచారించి ఇదివరలో జమీందారు గారు ధర్మకర్తగా ఉన్నప్పుడు, అడవి అంతా అమ్మిన వ్యవహారం అక్రమమనీ, రైతులు నజరానా కట్టకుండా ఆక్రమణ చేయటమూ అక్రమమేననీ, తీర్పు జెప్పి నజరానా కట్టి సాగు చేసుకొనేవారికి భూములు ఇయ్యవలసిందని ఆర్డరు వేశారట.

ఇప్పుడు ఆ భూములు బోర్డు వారు మనకిస్తారు కాని రైతులు మనకు అడ్డుతగులుతారు. అంతగా మనం ఎట్లాగో భూములు స్వాధీనం చేసుకొంటే, సాహుకారు అప్పుడొచ్చి ఆ భూములు తనవి అని కూర్చుంటాడు. కోర్టుల చుట్టూ తిరగాలె.

ఈ రైతులు అసలు మనలను పొలంలో కాలుపెట్టనివ్వరు! ఇంత వ్యవహారం ఉంది. నేను అక్కడున్న రెండు రోజులూ ఈ వ్యవహారానికి సంబంధించిన కాయితాలన్నీ చూచి వచ్చాను. మనకేం లాభం లేదు.” అని చెప్పాడు.

మా యిద్దరికీ చాలా విచారం కలిగింది. ఆ భూములే కొనుక్కొని చిక్కులలో పడటం కూడా అదొక మర్యాదే! అది మాకు దక్కలేదే అని కష్టం కలిగింది. ఇంతకూ

పోను అరవై రూపాయలు మిగులుతవనీ కూడా చెప్పాను.

ఆవిడ లెక్క జూచుకొని సంవత్సరానికి మూడు వందల రూపాయలు వస్తవి గదా అనుకొన్నది.

సంవత్సరానికి నాలుగైదు నవరసులు కొనుక్కోవచ్చునని కూడా ఆమె అనుకొని ఉంటుంది.

కృష్ణారావుగారి భార్య మా యింటికొచ్చి "ఒదినా మీ అన్నయ్య పొలాలు కొంటున్నారు విన్నావా?" అన్నది.

"మా ముసలాయన, మీ ఆయనా కలిసే వెళ్ళారుగా! ఇద్దరు చెరి పది ఎకరాలు కొంటారని నాకూ చెప్పారు రాత్రి" అన్నది మా ఆవిడ.

ఆ తరువాత ఈ విషయం మా పేటలో అందరికీ తెలిసింది. ప్రతివాళ్ళూ నన్ను అడిగేవాళ్ళే. "ఏమయ్యా భూములు కొంటున్నావుటగా! ఈ బుద్ధి పది ఏండ్ల క్రిందట ఉంటే ఈ పాటికి బోలెడు ఆస్తి సంపాదించే వాడివి" అని కొంతమంది అన్నారు.

మొత్తం మీద మా పేటలో నన్ను చూచి చాలా మంది సంతోషించారు. నాకు కాస్త ప్రాముఖ్యము వచ్చింది. ఇది వరకు ఎప్పుడూ నన్ను జూచి తలవంచుకు పోయే వాళ్ళు ఇప్పుడు నిలబడి నమస్కరిస్తున్నారు.

వీరయ్యగారు ఎప్పుడు వస్తారా అని కృష్ణారావుగారూ, నేనూ కనిపెట్టుకొని కూర్చున్నాము.

ఆయన వచ్చీ రావటంతోనే, వంద రూపాయలూ నజరానా కట్టాలని నేను అనుకొన్నాను. ఆయన ఆ మరునాడు రాలేదు. మూడోనాడు వచ్చాడని తెలిసింది.

ప్రొద్దున పదకొండు గంటల వేళ నాకు ఆయన వచ్చిన సంగతి తెలిసి వెంటనే వెళ్ళాను.

నాకంటే ముందు కృష్ణారావుగారు వచ్చి వాళ్ళ అరుగుపైన కూర్చున్నారు.

వీరయ్యగారు భోజనం చేసి బయటికి వచ్చి మా దగ్గర కూర్చున్నారు. నేనే

ప్రాప్తం లేకపోయింది.

అప్పుడే నేను అడిగాను కృష్ణారావుగారిని, "ఏమండీ మీరు సొమ్ము సిద్ధం చేసే ఉంచారు కాబోలును" అని.

ఆయన అప్పుడన్నాడు, "లేదండీ వీరయ్యగారినే ఈ భూములు కొంటానికి ఓ వంద రూపాయలు అప్పు అడుగుదామనుకొన్నాను! ఆయనకు ఈ భూములు ఎవ్వరూ కొనటం ఇష్టం లేదాయె. ఆయనా కొనటం లేదాయె! అల్లాటప్పుడు మనకు ఇస్తాడా అని అడగలేదు. మీరు డబ్బు రెడీగా పెట్టుకొని కూర్చున్నారు కామాలు ఏం?"

"ఎబ్బే, నేనూ వారినే అడుగుదామనుకొన్నాను. ఇట్లా అయిపోయింది" అన్నాను.

(1964)